





● ఆచంట : వరద నీటిలో పెదమల్లం మాచేనమ్మ ఆలయం ● యలమంచిలిలంకలో వరద నీటిలో గ్రామస్తుల రాకపోకలు ● నరసాపురం : నవరసపురం గ్రామంలోని ఎస్టీ కాలనీలోకి చేరిన వరద నీరు



ఉప్పుటేరు వరదలో సిద్దాపురం పాఠశాలకు పడవపై వస్తున్న పల్లిపాలెం విద్యార్థినులు

# తగ్గేదేలే..!

- వశిష్ఠ గోదావరిలో అదే ఉధృతి.. వరద నీటిలో మాచేనమ్మ ఆలయం..
- కనకాయలంక, పెదలంక జలమయం.. నవరసపురం ఎస్టీ కాలనీలోకి వరద నీరు
- ప్రమాదస్థాయిలో నీటి మట్టాలు.. ఆందోళనలో రైతులు.. ప్రజలు



ఆచంట/నరసాపురం/యలమంచిలి, సెప్టెంబరు 12: ఎగువ నుంచి సముద్రంలోకి 15 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడిచి పెట్టడంతో గురువారం ఆ ప్రభావం వశిష్ఠ గోదావరిపై పడింది. ఆచంట మండలం అయోధ్యలంక, పెద మల్లంలంక, కోడేరు లంక పల్లపు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయం నీట మునిగింది. గోదావరిలో నాటు పడవల రాకపోకలు నిషేధించారు. లంకగ్రామాల వాసులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాటర్ ప్యాకెట్లు సరఫరా చేస్తున్నారు. యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక జలమయం అయ్యాయి. కనకాయలంకలో గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. పెదలంకవాసులు మోకాళ్లలోతు నీళ్లలో నడిచివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దొడ్డిపట్ల, లక్ష్మీపాలెం గ్రామాల్లోని పల్లిపాలెం ప్రాంతాలు వరద ముంపు బారిన పడ్డాయి. యలమంచిలి లంక, బాడవ గ్రామాలకు చేరుకునే ప్రధాన రహదాలపై వరద నీరు ప్రవహిస్తోంది. ఏటిగట్టుకు లోపల లంక భూములు ముంపులోనే ఉన్నాయి. నరసాపురం బాపు ఘాట్, వలందర్ రేవుల్లో నీటి మట్టాలు పెరిగాయి. చేపల వేటను అనుమతించడం లేదు. మాధవాయిపాలెం స్లూయిస్ తలుపులను మూసివేశారు. లాకుల వద్దనున్న ఇసుక ర్యాంపు నీట మునిగింది. పొన్నపల్లిలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో మోకాలు లోతు నీరు చేరింది. పురపాలక సంఘం మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తోడింది. నవరసపురం ఎస్సీ కాలనీలోకి నీరు చేరింది. డ్రైనేజీ పొంగడంతో ఇళ్లల్లోకి నీరు వచ్చింది. ఇక కొత్త, పాత నవరసపురం గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రేవుల్లో స్నానాలు చేయకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఆర్డీవో అంబరీష్, ఏటిగట్లు శాఖ ఏఈ సుబ్బారావు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఉభయ గోదావరి జిల్లాల మధ్య నాలుగో రోజు రాకపోకలు సాగలేదు.



స్కూల్ నుంచి చిన్నారిని తీసుకువస్తున్న తండ్రి

## చినకాపవరం మురుగు కాల్వ ముంచేసింది



ఆకివీడు/ఆకివీడు రూరల్, సెప్టెంబరు 12 : ఎగువ నుంచి వస్తున్న వరదతో చినకాపవరం మురుగు కాల్వ నీటి మట్టం మరింత పెరిగి నివాసాలు ముంపు బారిన పడ్డాయి. సిద్ధాపురం వైపు వెళ్లే అటవీ శాఖ చెక్ పోస్టు దగ్గర వరద నీరు పెరుగుతోంది. సీహెచ్‌సీ ప్రభుత్వాసుపత్రి వరద నీటిలో ఉంది. దుర్వాసన, విషసర్పాల కారణంగా వైద్యులు, సిబ్బంది, రోగులు నడవలేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగస్తులు, వర్తకులు ఇబ్బంది పడుతున్నారు. గురువారం సాయంత్రానికి మూడంగుళాల నీటిమట్టం పెరిగింది. బుధవారంతో పోలిస్తే పెరుగుదల తక్కువగానే ఉంది. ఆకివీడు - సిద్దాపురం రహదారి బంద్ అయ్యింది. ప్రజలు ట్రాక్టర్లు, వ్యాన్‌ల మీద మాత్రమే ప్రయాణిస్తున్నారు. చినకాపవరం డ్రెయిన్ నీరు వెనక్కి వస్తుండటంతో కోళ్లపర్రు వంతెనపై ప్రవాహం పెరిగింది. సిద్దాపురంలో వరి పైరును కాపాడుకోవడానికి రైతులు చివరి ప్రయత్నంగా ఛానల్ వంతెన వద్ద కర్రలను పాతి బరకం కట్టి మట్టి బస్తాలు వేసి అడ్డుకట్ట కట్టారు. ఉప్పుటేరు గట్టు మీద ఉన్న పల్లిపాలెం చుట్టూ వరద నీరు చేరడంతో సిద్దాపురం జడ్పీ పాఠశాల విద్యార్థినులు పడవలపై ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నారు.

### కొల్లేరులో నుంచి ఎగువకు పాతవయ్యేరులోకి నీరు

## లాగని నీరు

- ముంపులో అడవిపర్ర పొలాలు..



మొగల్తూరు, సెప్టెంబరు 12 : మొగల్తూరు మండలం రామన్నపాలెం అడవిపర్రలో ముంపు నీరు లాగక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధిక వర్షాలతో సార్వా ఆరంభంలోనే నాట్లు కుళ్లిపోయాయి. సబ్సిడీపై ప్రభుత్వం ఇచ్చిన విత్తనాలను వెదజల్లి రైతులు మరోసారి నాట్లు వేశారు. ఆరు రోజులపాటు ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ఈ నాట్లు కూడా కుళ్లిపోయాయి. ఎకరాకు రూ.23 వేల వరకూ నష్టం వాటిల్లినట్టు రైతులు యాతం పాండురంగారావు, మేకల పరుశరామ్ వాపోయారు. అడవిపర్రలో గతంలో 1600 ఎకరాల్లో వరి సాగు చేసేవారు. చేలల్లో ముంపు నీరు లాగే దర్బరేవు డ్రెయిన్ ప్రక్షాళనకు నోచుకోకపోవడంతో ఏటా ఆటు పోట్ల ప్రభావంతో నష్టపోతున్నట్టు రైతులు వివరించారు. దీంతో 1300 ఎకరాలను చేపలు, రొయ్యల చెరువులుగా తవ్వేశారు. మిగిలిన 300 ఎకరాల్లో సార్వా, దాళ్వా సాగు చేస్తున్నారు. వీటిలో అత్యధిక భాగం ముంపునకు గురైంది. రెండుసార్లు ఊడ్పులు చేసి నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.6,800 తక్షణమే విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. దర్బరేవు మురుగు డ్రెయిన్ ప్రక్షాళన చేసి కొత్తకాయలతిప్ప వద్ద రెగ్యులేటర్ నిర్మిస్తే గాని మొగల్తూరు మండలం రామన్నపాలెం, కొత్తకాయలతిప్ప వరి పొలాలు సాగు చేసే పరిస్థితి లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బందారు మాధవనాయుడు డ్రెయిన్ ప్రక్షాళనకు, రెగ్యులేటర్ నిర్మాణానికి రూ.3 కోట్లతో అంచనాలు రూపొందించి మంజూరు చేయించారు. అదే సమయంలో సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో ఈ పనులు ముందుకు సాగలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం దర్బరేవు డ్రెయిన్ ప్రక్షాళన, రెగ్యులేటర్ నిర్మాణంపై దృష్టి సారించాల్సి వుంది.

## పల్లె పారిశుధ్యం బాగుపడాలి

- వర్షాలతో మురుగు నీరు, చెత్తలతో రోగాలకు నాంది
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 23.73 కోట్లు విడుదల.. వీటితో చెత్త సేకరణ, డ్రెయిన్లను సరిదిద్దాలి



భీమవరం రూరల్, సెప్టెంబరు 12 : భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. డ్రెయిన్లు పూడుకుపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. ఇది రోగాలు ప్రబలడానికి కారకాలుగా మారుతున్నాయి. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో ఇప్పుడు ఈ పరిస్థితికి కారణం. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసింది. ఒక్కొక్కటి రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పెట్టి నిర్మించింది. వాటిని వైసీపీ ప్రభుత్వం మరుగునపడేలా చేసింది. దీంతో గ్రామాల్లో చెత్త సమస్యగా మారింది. జిల్లాలో 393 గ్రామాల్లో 363 డంపింగ్ యార్డులు ఉన్నాయి. వాటిలో కొన్నే ఉపయోగిస్తున్నారు. అన్నింటిని ఉపయోగంలోకి తీసుకు వస్తే పారిశుధ్యం మెరుగుపడుతుంది. వీటిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం 2023-24లో రెండో దఫా 15వ ఆర్థిక సంఘం నిధులను అందుబాటులోకి తెచ్చింది. పాలకవర్గాలు, అధికారులు ఇప్పుడు అధికారులు పల్లెల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి. వీటిని మెరుగు పరిస్తేనే ఆరోగ్య వాతావరణం ఏర్పడుతుంది. ఇప్పటికే అనారోగ్యం బారిన పడిన వారి సంఖ్య పెరుగుతూ వస్తుంది. జనాభా లెక్కల ప్రకారం మేజర్ పంచాయతీకి రూ.25 లక్షలు, మైనర్ పంచాయతీకి రూ. 10 లక్షల చొప్పున 393 పంచాయితీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.23.73 కోట్లు విడుదలచేసింది. 20 మండల పరిషత్ కార్యాలయాలకు రూ.12.55 కోట్లు మంజూరయ్యాయి. వీటితో పారిశుధ్యం, తాగునీటి పనులు చేసుకోవచ్చు.

### కచ్చా డ్రెయిన్లే పరిష్కారం

వర్షపు నీరు బయటకుపోతేనే మురుగునీటి సమస్య తీరుతుంది. ప్రస్తుతం గ్రామాల్లో వర్షం పడితే ఎక్కడ నీరు అక్కడే ఉంటుంది. దీనికి కారణం కచ్చా డ్రెయిన్లు లేకపోవడమే. గతం లో కచ్చా డ్రెయిన్‌లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేయించేవారు. ఆ విధానం నిలిపివేశారు. మురుగు నీరు బయటకు వెళ్లే దారి లేకపోయింది. అందువల్ల గ్రామాల్లో కచ్చా డ్రెయిన్లు వర్షాకాలం తప్పనిసరి అని గ్రామస్తులు అంటున్నారు. మొన్నటి వరకు భారీ వర్షాలకు ఎక్కువగా నీరు రహదారులపై నిలిచిపోయి ముంపునకు గురైంది. దీనిపై ఇటీవల జిల్లా కలెక్టర్ నాగరాణి పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపరిచే పనులు చేపట్టాలని సూచించారు. దీంతో చాలా పంచాయతీల్లో పాలకవర్గాలు ప్రతీ రహదారి ఇరువైపులా బ్లీచింగ్ చల్లడం వంటి తాత్కాలిక పనులు చేపట్టే పనిలో పడ్డారు. పారిశుధ్యం మెరుగు పరిచేలా పూర్తి స్థాయి పనులు చేస్తే రోగాలను అరికట్టవచ్చు.

## ఇవి చేలా.. చెరువులా ?

- నక్కల అవుట్ ఫాల్స్ స్లూయిజ్ తలుపు మొరాయింపు
- నక్కల డ్రెయిన్‌లోకి వరద నీరు.. ముంపులో వరి చేలు



యలమంచిలి, సెప్టెంబరు 12 : వడ్డిలంక వద్ద నక్కల అవుట్ ఫాల్స్ స్లూయిజ్ తలుపు మొరాయిండంతో వరద నీరు ఎగదన్ని నక్కల కాలువలోకి చేరుతోంది. ఈ కారణంగా డ్రెయిన్ పొంగి ఆయకట్టు పరిధిలోని ఆచంట వేమవరం, గుమ్ములూరు, వద్దిపర్రు, కాంభోట్లపాలెం, గుంపర్రు, చింతదిబ్బ గ్రామాల పరిధిలోని వందల ఎకరాల వరి చేలు ముంపుబారిన పడి చెరువులను తలపిస్తున్నాయి. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నక్కల అవుట్ ఫాల్స్ స్లూయిజ్ నిర్వహణ గాలికొదిలేయడంతో వరదల సమయంలో తలుపులు మొరాయించి నక్కల డ్రెయిన్‌లోకి వరదనీరు ఎగదన్నడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు నెల రోజుల క్రితం నిధులు మంజూరుచేసి స్లూయిజ్‌కు కొత్త తలుపును ఏర్పాటుచేశారు. వరద ఉధృతి పెరుగున్న సమయంలో స్లూయిజ్‌కు ఉన్న ఒక తలుపు మొరాయించడంతో వరద నీరు నక్కల డ్రెయిన్‌లోకి చేరుతోంది. ఈ లీకేజీని అరికట్టేందుకు డ్రెయిన్స్ అధికారులు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. మొరాయించిన తలుపు వద్ద షట్టర్‌ను దించి, క్రేన్ సహాయంతో ఆ ప్రాంతంలో వలల్లో ఉంచిన ఇసుక బస్తాలు వేస్తున్నారు. నక్కల డ్రెయిన్‌లోకి చేరుతున్న నీటి ప్రవా హం గురువారం సాయంత్రానికి కొంత తగ్గింది. పూర్తిగా లీకేజి ఆగే వరకూ ఇసుక బస్తాలు వేసే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. డ్రెయిన్ల ఈఈ పి.సుబ్రమణ్యేశ్వరావు, డీఈ జి.వినోద్‌చంద్, ఏఈ ఎం.దుర్గారావు లీకేజిని అరికట్టే పనులను పర్యవేక్షిస్తున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, యలమంచిలి నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఆరుమిల్లి రామశ్రీనివాస్ స్లూయిజ్ వద్ద పరిస్థితిని పరిశీలించారు.



ఎమ్మెల్యే ఆరిమిల్లికి వరద సాయం చెక్కును అందించిన అపుస్మా నాయకులు

## అపుస్మా సాయం రూ.14.74 లక్షలు

తణుకు, సెప్టెంబరు 12 : తణుకు జోన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్, ప్రైవేటు కాలేజీల(అపుస్మా) సభ్యులు, విద్యార్థులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.14 లక్షల 74 వేల 400 చెక్కును బుధవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు అందజేశారు. వీరిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో శశి విద్యా సంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, మాంటిస్సోరి స్కూలు అధినేత అనపర్తి ప్రకాశరావు, ప్రగతి సంస్థల అధినేత ప్రగతి రాజా, జిల్లా కార్యదర్శి గోపిశెట్టి రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విద్యాకాంత్, తణుకు పట్టణ అధ్యక్షుడు నాసరి రాజశేఖర్, కార్యదర్శి కోడూరి సూర్యశశాంక్, కోశాధికారి హరి, పట్టణ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

## రైతుల రుణాలు రీషెడ్యూలు చేయండి : కలెక్టర్

భీమవరం టౌన్, సెప్టెంబరు 12 : వరదలతో నష్టపోయిన రైతుల రుణాలను రీషెడ్యూల్ చేసి, క్రాఫ్ రుణాలను ఉదారంగా మంజూరు చేయాలని కలెక్టరు చదలవాడ నాగరాణి బ్యాంకర్లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్‌లో యూబీఐ, నాబార్డు అధికారులతో డీసీసీ బ్యాంకర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రెండు పర్యాయాలు వచ్చిన అధిక వర్షాలు, వరదల కారణంగా జూన్‌లో 94 గ్రామాల్లోని 9,918 మంది రైతులు 5,297.32 హెక్టార్ల పంటను, జులై, ఆగస్టు నెలల్లో 122 గ్రామాల్లోని 6,050 మంది రైతులు 3,454.89 హెక్టార్ల పంటలను నష్టపోయారన్నారు. 963 మంది రైతులు 238 హెక్టార్ల ఉద్యాన పంటలను నష్టపోయారన్నారు. వీరందరి రుణాలను రెండేళ్ల నిలుపు దల చేసి, రైతులు, కౌలు రైతులకు క్రాప్ లోన్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, యూబీఐ రీజనల్ హెడ్ టి.సంగీతకుమారి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, నాబార్డు డీడీఎం టి.అనిల్‌కాంత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బది'లీలలు'

- ప్రక్రియ 22 వరకు పొడిగింపు
- ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణలు
- ఎక్సైజ్‌లో పోటీ తీవ్రం




ఏలూరు/భీమవరం టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై నిషేధం తొలగించి ఈ నెల 16వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఇంతకుముందు ఆదేశించింది. ఈ లోపే వరదలు రావడంతో అనేక జిల్లాలు వీటి బారిన పడడం తో సహాయక చర్యల్లో కొందరు నిమగ్నమయ్యారు. ఈ తరుణంలో బదిలీల ప్రక్రియను మరోసారి పొడిగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరికొద్ది రోజుల్లోనే పోస్టింగ్ ఆర్డర్లకు అవకాశం ఉన్న తరుణంలోనే ఇప్పుడున్న ప్రక్రియను ఈ నెల 22 వరకు ప్రభుత్వం మరోసారి వాయిదా వేసింది. ఇప్పటికే తమకు కావాల్సిన ప్రాంతంలో పోస్టింగ్ కోసం మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ గిరగిరా తిరిగారు. మరోసారి గడువు పొడిగింపుతో తమ ప్రయత్నాలకు మరింత పదును పెట్టబోతున్నారు. ఎక్సైజ్ శాఖకు మాత్రం ఈ నెలాఖరు వరకు బదిలీలకు అనుమతి ఇచ్చింది. వచ్చే నెల 1వ తేదీ నుంచి బదిలీల నిషేధం అమలులోకి వస్తుంది. కొన్ని శాఖలకు మినహా మిగతా శాఖలకు బదిలీలు చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. అయితే ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారిని కచ్చితంగా బదిలీ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. వాటిలో కొన్ని పరిపాలన సౌలభ్యం కోసం బదిలీ చేసే అవకాశం కల్పించారు. ఇప్పటికే మునిసిపాల్టీకి సంబంధించి బదిలీల ప్రక్రియ జరిగింది. కమిషనర్లకు బదిలీలు చేసి పోస్టింగ్‌లు ఇచ్చేశారు. ప్రస్తుతం బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారు తాము కోరుకున్న చోటుకు స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకుని బదిలీ అవుతుందనే ధీమాతో ఉన్నా రు. మరి కొందరు తమకు ఎక్కడ ఇచ్చినా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇంకొందరు అధికారులు, ఉద్యోగులు మాత్రం ఉన్నచోట ఉండే విధంగా స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుని తమకు బదిలీ కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నెల 22 వరకు అవకాశం ఉన్నందున తమకు బదిలీలు అదే రోజు రాత్రి ఉత్తర్వులు వస్తాయనే ధీమాతో ఉన్నారు. జిల్లా నుంచి సుమారు రెండు వేల వరకు ఉద్యోగులు బదిలీ అవుతారని సమాచారం. ఈ నెల 23 నుంచి బదిలీలపై తిరిగి బ్యాన్ కొనసాగుతుంది.

### మాకంటే.. మాకే

బదిలీ ప్రక్రియల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఉండడంతో ఆ శాఖకు సంబంధించిన కొందరు ఉన్నత స్థాయిలోనే కోరుకున్న స్థానం కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఏలూరు, భీమవరం, తణుకు, నూజివీడు ఈ తరహా వాటన్నింటి లోనూ రిజిస్ట్రేషన్ల సంఖ్య ఇంతకు ముందు కంటే ఈ మధ్యన పెరిగింది. వైసీపీ ప్రభుత్వం ఓటమి పాలై ఆ స్థానంలో కూటమి ప్రభుత్వం రావడంతో ఎక్కడికక్కడ లావాదేవీలు పెరిగి దాని ప్రభావం కాస్తా రిజిస్ట్రేషన్లపై పడింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖలోనే బదిలీలు కోరుకున్న వారి సంఖ్య భారీగా పెరిగింది.

### మనోడేనా..

బదిలీల ప్రక్రియ ముందుకు పొడిగించడంతో ఇప్పటికే కొందరి విషయంలో ఇచ్చిన సిఫార్సులపైన ఎమ్మెల్యేలు పునరాలోచనలో పడినట్టు చెబుతున్నారు. ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కొందరిని తమ నియోజకవర్గంలోకి బదిలీ చేయించుకునే దిశగా మరి కొందరు ఎమ్మెల్యేలు ఇంతకుముందు ఇచ్చిన సిఫార్సు లేఖలను మార్చే ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. సామాజిక వర్గాల వారీగా, గడిచిన ఐదేళ్లల్లో ప్రభుత్వపరంగా ఏ పనులు లేక ఒకేచోట ఉండిపోయి విసుగెత్తిన ఇంకొందరు తమకు ఫలానా ప్రాంతం కావాలని పట్టుబట్టి మరీ అమరావతి నుంచి ఫోన్‌లు చేయించడం, తదనుగుణంగానే మార్పులు, చేర్పులకు వీలుగానే సిఫార్సు లేఖలు మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. సచివాలయ సిబ్బంది విషయంలోను ఇప్పుడు ఇదే జరుగుతోంది. నియోజకవర్గ కేంద్రాల్లో పనిచేసేందుకే అత్యధికులు సుముఖంగా ఉండడంతో స్థానిక నేతలపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి.

### ఎక్సైజ్‌కు పూర్వ వైభవం


గత ప్రభుత్వం సెబ్ ఏర్పాటు తర్వాత ఎక్సైజ్‌లో చాలా మంది డీలా పడ్డారు. ఇప్పుడు తాజాగా సెబ్‌ను రద్దు చేయడంతో ఆ స్థానంలో తిరిగి ఎక్సైజ్ శాఖకు పూర్వ వైభవం తేనున్నారు. 2019 వరకు ఉన్న వ్యవస్థ మళ్లీ యథావిధిగా కొనసాగడం, ఎక్సైజ్ ఉద్యోగుల బదిలీలు ఈ నెల 30లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం కోరడంతో ఆ మేరకు ఎక్సైజ్‌లో సరికొత్త ఎక్సర్‌సైజ్‌లు ప్రారంభమయ్యాయి. పాత మద్యం విధానమే తిరిగి రానున్నదనే ప్రచారం జరుగుతుండగా ఆ దిశగా తమకు సహకరించే ఎక్సైజ్ అధికారుల కోసం ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యేలు అన్వేషించి లిస్టు కూడా సమకూర్చుకు న్నారు. ఇప్పుడు ఈ తరహా పరిస్థితినే మదింపు చేసుకుని ఎక్సైజ్‌లో సీనియర్లు తాము కోరుకున్న స్థానం కోసం పట్టుపడుతున్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆట్యా పాట్యా జిల్లా జట్టుతో నిర్వాహకులు

## ఆట్యా పాట్యా జూనియర్స్ జిల్లా జట్టు ఎంపిక

భీమవరం అర్బన్, సెప్టెంబరు 12: ఆట్యా పాట్యా జూనియర్స్ జిల్లా బాలురు, బాలిక జట్టు ఎంపికను భీమవరంలోని చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూలులో గురువారం నిర్వహించారు. ఈ పోటీలో సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీలలో కర్నూలలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా ఆట్యాపాట్యా అసోసియేషన్ అధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు, కార్యదర్శి కిరణ్ వర్మ తెలిపారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయలు జీపీసీ శేకర్ రాజు, రామభద్రంరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



తణుకు, సెప్టెంబరు 12: ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. తణుకు చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. బి.నాగలక్ష్మిదుర్గ కె.జ్యోతి బహుమతులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థినులు, పీడీ రత్నకుమారిని జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు అభినందించారు.


ఎన్‌బీఏ గుర్తింపు పత్రంలో కళాశాల యాజమాన్యం

## స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 12: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలకు జాతీయ స్థాయిలో నేషనల్ బోర్డు ఆఫ్ అక్రెడిటేషన్ (ఎన్‌బీఏ) టైర్ వన్ గుర్తింపు లభించింది. గురువారం కళాశాలలో విలేకర్ల సమావేశంలో ఛైర్మన్ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్,ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గోపీచంద్‌లు మాట్లాడుతూ ఎన్‌బీఏ ఛైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులు ఈ ఏడాది జూలై నెలలో కళాశాలను సందర్శించారన్నారు. మౌలిక వసతులు, ఉపాధి, సిలబస్, డిజైన్, విద్యా ప్రమాణాలు, ఉత్తీర్ణత, క్రమశిక్షణ తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఎన్‌బీఏ ఈ గుర్తింపు ఇచ్చిందన్నారు. ఇప్పటికే న్యాక్, అటానమస్ గుర్తింపులు ఉన్నాయన్నారు. డైరెక్టర్లు శ్రీహరి, పీవీఆర్, బాబు, హెచ్‌వోడీ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై ఇతర రాష్ట్రాల రైతులకు శిక్షణ

ఉంగుటూరు, సెప్టెంబరు 12 : రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య (ఏలూరు) సహకారంతో ఇతర రాష్ట్రాల రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నారు. గురువారం ఏలూరు జిల్లాలో చందు ఆధ్వర్యంలో సంబంధిత బృందం ఉంగుటూరు, నాచుగుంట, వెల్లమిల్లి గ్రామాలలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. మాస్టర్ ట్రైనర్ గద్దే రత్నాజి పలు అంశాలపై సలహాలు సూచనలు అందించారు. వెల్లమిల్లి పరిమి రాజేంద్ర క్షేత్రంలో వివిధ కూరగాయల పంటల సాగును పరిశీలించారు

## నేటి నుంచి పాలకొల్లు చినగోపురంలో పవిత్రోత్సవాలు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 12 : వైష్ణవ క్షేత్రం అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయం (చిన్న గోపురంలో) 13వ తేదీ శుక్రవారం నుంచి స్వామివారి పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈవో బిరుదుకోట సత్యనారాయణ శంకర్ తెలిపారు. 13వ తేదీ శుక్రవారం సాయంత్రం అంకురార్పణ, 14వ తేదీ ఉదయం శ్రీలక్ష్మీ నృసింహ హవనం, సాయంత్రం గరుడ వాహనసేవ, 15వ తేదీ ఉదయం తిరుమంజనం, సాయంత్రం పవిత్ర సమర్పణలు, 16వ తేదీ ఉదయం మహాలక్ష్మీ హవనం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నకూటోత్సవం, సాయంత్రం పవిత్ర వితరణ, 17వ రోజు ఉదయం అలంకార తిరుమంజనం, శాంతి కల్యాణం, సాయంత్రం శ్రీవారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## స్మార్ట్ మీటర్స్ వచ్చేస్తున్నాయి

### మొదటగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు

భీమవరం టౌన్, సెప్టెంబరు 10 : ప్రభుత్వ కార్యాలయాలకు త్వరలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత మీటర్ల స్థానంలో వీటిని ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు సర్వే చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన వెంటనే జిల్లాలోని 6,445 ప్రభుత్వ కార్యాలయాల్లో మీటర్లను ఏర్పాటు చేస్తారు. స్మార్ట్ మీటర్లను మూడు విడతల్లో ఏర్పాటు చేస్తారు. మొదట ప్రభుత్వ కార్యాలయాలకు, రెండో విడత వాణిజ్య విభాగాలకు, చివరగా వినియోగదారుల ఇళ్ళకు ఏర్పాటు చేయనున్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే కరెంటు బిల్లులు పెరుగుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ అలాంటిది ఏమీ ఉండదని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. మీటరుకు సంబంధించిన సొమ్ము ఎవరు ?ఎలా చెల్లించాలి ? బిల్లులకు సంబంధించి ఎన్నో విషయాలపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తారు. స్మార్ట్ మీటర్‌లో సిమ్ కార్డు వేసుకుంటే ప్రీపెయిడ్ మీటర్‌గా మార్చుకునే అవకాశం కూడా ఉంటుంది.స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ వినియోగంపై ఏరోజు సమాచారం ఆ రోజు రావడంతో పొదుపుగా వాడుకునే అవకాశం ఉంటుంది. స్లాబ్‌లు దాటకుండా చర్యలు తీసుకుని సొమ్ములు ఆదా చేసుకోవచ్చు.

## టీడీపీ నాయకుని మోటార్ సైకిళ్లు దగ్ధం



తణుకు, సెప్టెంబరు 12 : తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ రెడ్డి నరేంద్రప్రసాద్ ఇంటి ముందు ఉన్న రెండు స్కూటీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. నరేంద్రప్రసాద్ ఇంటి ముందు ఉంచిన రెండు స్కూటీలను గుర్తు తెలియని వ్యక్తులు తగల పెట్టినట్లు ఆయన రూరల్ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ వీధిలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీ పూర్తిగా పరిశీలించారు. వీరభద్రపురానికి చెందిన రాజేష్, మేకర్, మండపాకకు చెందిన జానులను అనుమానితులుగా గుర్తించామన్నారు. పూర్తిస్థాయి విచారణ చేస్తున్నామని ఎస్ఐ చంద్రశేఖర్ చెప్పారు.

## దంపతులకు పాము కాటు.. అస్వస్థత



పోలవరం, సెప్టెంబరు 12 : పాము కాటుతో వ్యవసాయ కూలీ దంపతులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన పోలవరం మండలం పట్టిసీమలో గురువారం జరిగింది. పాత పట్టిసీమకు చెందిన కాత్రు శ్రీను, బుజ్జి పొలానికి వెళ్లి పని చేస్తుండగా పాముకాటు కాటు వేయడంతో బుజ్జి వెంటనే గట్టిగా అరిచి కిందపడిపోయింది, కిందపడిపోయిన భార్యను లేపడానికి వెళ్లిన భర్తను అదే పాము కాటు వేయడంతో ఇద్దరూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్పందించిన సాటి కూలీలు వారిని పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యాధికారి కృష్ణంరాజు వారికి ప్రథమ చికిత్స అందించారు. వైద్యాధికారి మాట్లాడుతూ కరిచిన పాము విషపూరితమైనది కాదని, ప్రాణా పాయం లేదని తెలిపారు. వ్యవసాయ కూలీలు, రైతులు ఈ వర్షాల సీజనులో విష కీటకాలు, పాముల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని పాముకాటు వేసిన వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి చేరుకుని వైద్యం పొందాలని ప్రభుత్వ ఆసు పత్రిల్లో పాముకాటు విరుగుడు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 12 :తెలంగాణ నుంచి అక్రమంగా 15 మద్యం బాటిళ్లు తెస్తున్న వ్యక్తిని పోలీస్‌లు పట్టుకుని కేసు నమోదు చేశారు. పి.రాజవరం గ్రామానికి చెందిన స్వయంవరపు సూరిబాబు 15 ఓల్డ్ అడ్మిరాల్ క్వార్టర్ బాటిళ్లు తీసుకుని సంచిలో ఉంచి తాటియాకులగూడెం సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నడుచుకుంటూ వెళుతుండగా అనుమానం వచ్చి పోలీస్‌లు తనిఖీ చేశారు. సంచిలో తెలంగాణ మద్యం బాటిళ్లు 15 ఉండటంతో వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ చెప్పారు.

# వణికిస్తున్న జ్వరాలు



### విజృంభిస్తున్న వైరల్ ఫీవర్స్
### ఎక్కువగా టైఫాయిడ్ కేసులు
### రోగులతో ఆసుపత్రులు కిటకిట

**వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నాయి. ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. మొన్నటి వరకు డెంగీ జ్వరాలతో ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం అవి తగ్గుముఖం పట్టినా వైరల్ ఫీవర్స్ వెంటాడుతున్నాయి. ప్రతీ ఇంటిలోను జ్వర పీడితులు ఉంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న సర్వేలో కూడా జ్వరాలకు సంబంధించి పీహెచ్‌సీలో పరిధిలో 10 నుంచి 15 వరకు నమోదవుతున్నాయని చెబుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ఈ జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని చెబుతున్నారు.**

భీమవరం టౌన్, సెప్టెంబరు 12 :

#### కొవిడ్‌లాగే జాగ్రత్తలు పాటించాలి

కోవిడ్ వచ్చినపుడు ఎటువంటి జాగ్రత్తలు తీసుకున్నామో అలాంటివే పాటించాలని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు. వైరల్ జ్వరాలు కావటంతో వాటిని అరికట్టలాంటే జాగ్రత్తలు అవసరం. జ్వరం వచ్చినవారు ఉపయోగించిన వస్తువులు వాడకపోవటం, దగ్గు, తుమ్ములు వచ్చినపుడు చేయి అడ్డుపెట్టుకోవటం, మాస్క్ ధరించటం, వంటివి వాడితే తొందరగా అరికట్టవచ్చనని చెబుతున్నారు. జ్వరం వచ్చినవారు బయట తిరగకుండా ఇంటి వద్దనే ఉండాలి. కాచి వడగట్టిన నీటిని తాగటం వల్ల కూడా కొంత అరికట్టవచ్చనని చెబుతున్నారు.


#### ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల తనిఖీ

ఎక్కువగా జ్వరాలు వచ్చే గ్రామాల్లో వాటర్ ప్లాంట్లలో నీటిని తనిఖీ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. నరసాపురం, పెనుమంట్ర మండలం ఆలమూరు, తాడేపల్లిగూడెం రూరల్ మండలం, అత్తిలి ప్రాంతాల్లో జ్వరాలు ఎక్కువగా ఉంటున్నాయని అందువల్ల అక్కడ నీటిని పరిశీలించామన్నారు. వీరవవాసరం మడలం కొణితివాడ పీహెచ్‌సీ పరిధిలో ఒక వాటర్ ప్లాంట్‌లో ఇబ్బందులు ఉన్నటుగా నివేదిక రావడంతో ప్లాంట్‌ను మూయించి వేసినట్టు తెలిపారు. పూర్తిస్థాయిలో శుభ్రం చేసిన తరువాత నీటిని తనిఖీ చేసి పరిశుభ్రంగా ఉన్నట్లు నివేదక వస్తేనే సరఫరా చేసేందుకు అనుమతి ఇస్తామన్నారు.

#### ప్రజల్లో అవగాహన

వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటిని కాచుకుని తాగలాలని, దోమలు రాకుండా చూసుకోవాలని, జ్వరాలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచిస్తున్నారు. ఎక్కువగా దగ్గు, రొంప, తీవ్రమైన జ్వరం వస్తోందని, మూడు రోజుల పాటు ఉం టుందని అప్పటికీ తగ్గకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

#### ప్లేట్ లెట్స్.. తగ్గిపోతే..




ప్రభుత్వ ఆసుపత్రిల్లో జ్వరాల్లో ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్న రోగుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సూచనలు అందిస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. 70 వేల కంటే కౌంట్ తక్కువగా ఉంటే వెంటనే జిల్లా ఆసుపత్రులకు సంబంధిత రోగిని తరలించి మెరుగైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. దీనివల్ల రోగికి ఇబ్బంది కలగకుండా ఉంటుంది. డెంగీ లక్షణాలు ఉన్నట్లుగా ప్రైవేట్ హస్పటల్‌లో చేరే రోగికి సంబంధించిన బ్లడ్ శ్యాంపిల్ ఇవ్వాలని కూడా ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.


అత్తిలిలో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారులు

## అత్తిలిలో ఆందోళన

### జ్వరాలతో ఇద్దరి మృతిపై గ్రామంలో భయం..

**అత్తిలి :** అత్తిలిలో డెంగీ జ్వరాలతో మొన్న చిన్నారి మృతి చెందగా, నేడు 17 ఏళ్ళ యువకుడు చనిపోవడంతో పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. మండలంలోని గ్రామాల్లో కూడా డెంగీ జ్వరాల ప్రభావం అధికంగా కనిపి స్తున్నది. గ్రామాల్లో జ్వరాలతో సతమతమవుతున్నారు. అత్తిలి, మంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కంటే ప్రైవేటు డాక్టర్లనే ఎక్కువగా ఆశ్రయిస్తు న్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు జ్వరాలతో సతమత మవుతున్నారు. ఎక్కడ చూసినా అనారోగ్య సమస్యలతో ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో రక్త పరీక్షలు చేయక పోవడం, అవగాహన కల్పించడంలో వైద్యులు విఫలమవుతున్నారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వాటికి రక్త పరీక్షలు చేయకపోవడంతో ప్రైవేటు వైద్య లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులు అడ్డగోలుగా దోచు కుంటున్నారు. రకరకాల పరీక్షలు చేసి రోగులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మాత్రం నామ మాత్రంగానే ఉంది. దోమల నివారణకు గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలను ఉపయోగించి కట్టడి చేయాల్సి ఉన్నప్పటికీ వాటిని వినియోగించకుండా మూలన చేర్చారు. మొక్కుబడిగా నీటి నాణ్యతా పరీక్షలు చేస్తున్నారు.

### పరిశీలించిన వైద్యాధికారులు

అత్తిలి మండలంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ఏ గృహాన్ని సందర్శించినా జ్వరపీడితులు ఉన్నారు. జ్వరాలకు తోడు విపరీతమైన నొప్పులతో బాధపడుతున్నారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్ ప్రసాద్, అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో అమీలుజమా, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు జ్వరాలతో మృతి చెందిన వారి ఇండ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ సర్వే, యాంటి లార్వా ఆపరేషన్ పరిశీలించారు. హెల్త్ అసిస్టెంట్స్, గ్రామ ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు ప్రతి రోజూ ఫీవర్ సర్వే చేయాలన్నారు.

## ప్రభుత్వ సాయం రైతులకు అందాలి

### భారీ వర్షాలు, వరదల్లో అధికారుల సేవలు అభినందనీయం
### స్థాయి సంఘ సమావేశాల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 12:ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు వల్ల జిల్లాలో పంట నష్టం జరిగిందని దీని నిమిత్తం ప్రభుత్వం కల్పిస్తున్న సహాయాన్ని రైతాంగానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. గురువారం జడ్పీ కార్యాలయంలో జరిగిన స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల వల్ల నష్టపోయిన వారందరికీ , నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం కల్పిస్తున్న సాయం ప్రతి ఒక్కరికి అందేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖలకు సంబంధించిన సంక్షేమ పథకాల అమలులో జిల్లా అధికారులు స్ఫూర్తి దాయకంగా పనిచేస్తున్నారని ఛైర్ పర్సన్ అధికారులను అభినందించారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడుతూ ప్రతినెలా 1వ తేదీనే సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందితో పెన్షన్లు పంపిణీ పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో హౌసింగ్‌కు సంబంధించిన 2014-2019 సంవత్సరంలో ఎన్‌టీఆర్ గృహ యాప్‌లో నమోదు చేసిన బిల్స్‌ను ఆన్‌లైన్ చేస్తున్నామని దీనిని కొత్త స్కీంలో పెడుతున్నట్టు హౌసింగ్ అధికారులు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 93 లక్షల 75 వేల పని దినాలను కల్పించామని, 3 లక్షల 72 వేల మందికి జాబ్‌కార్డులు ఇచ్చామని ,


రెసిడెన్షియల్ స్కూల్స్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే


జడ్పీ సమావేశంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ , వివిధ శాఖల అధికారులు

జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి 500 ఎకరాల్లో గ్రౌండ్ లెవెల్ చేస్తున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ శిథిలమైన దేవాలయాలను పునరుద్ధరించటానికి ప్రజల భాగస్వాముల నిధులతో పాటు సీజీఎఫ్ అక్కౌంట్ కింద నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. టీటీడీ ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాల్లో దేవాలయాల నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

#### ఫోన్ చేసినా స్పందించరా : ఎమ్మెల్యే బొలిశెట్టి

వివిధ సమస్యలపై ఫోన్ చేసినా స్పందించకపోవడం, తాము అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో రెసిడెన్షియల్ స్కూల్స్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్‌పై తాడేపల్లిగూడెం, చింతలపూడి ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, సొంగా రోషన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సమావేశానికి ప్రిపేరై రాలేదని ఆ మహిళా అధికారి చెప్పిన సమాధానికి వారు ఆశ్చర్యపోయారు. గత ఐదేళ్లలో ఎంత మంది పిల్లలకు కొత్తగా సీట్లు ఇచ్చారు ? రెసిడెన్షియల్ స్కూల్స్‌లో మెనూ ఎలా అమలవుతోందని ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. తాడేపల్లిగూడెంలో ఐదు ఎకరాల భూమి ఉందని అందులో రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని లెటర్ పంపాను ఏం చర్యలు తీసుకున్నారని బొలిశెట్టి ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఏమైనా కోచింగ్ ఇస్తున్నారా అని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రశ్నించారు. సమావేశాల్లో జడ్పీ సీఈవో సుబ్బారావు, డిప్యూటీ సీఈవో నిర్మలాజ్యోతి, వివిధ మండలాల జడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పి.అంకంపాలెంలో వేలంలో పొందిన లడ్డూతో భక్తులు

## 20 కేజీల లడ్డూ.. రూ.3.80 లక్షలు

జీలుగుమిల్లి/కాళ్ల సెప్టెంబరు 12:పి.అంకంపాలెం వినాయక యూత్ సభ్యులు లడ్డూ వేలం వేయగా రూ.3.80 వేలకు భక్తులు దక్కించుకున్నారు. జీలుగుమిల్లిలో శొంఠి మురళి రూ.50,116కు లడ్డూ పాట పాడారు. జీలుగుమిల్లిలో ఆర్య వైశ్య సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఉదయ్‌భాస్కర్ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని గురువారం బుడుగుల చెరువులో నిమజ్జనం చేశారు. చిత్తపూడి పవన్, కొప్పుల నాగరాజు, యార్లగడ్డ శివ, పసుపులేటి బాలాజీ, పేరాబత్తుల గంగాధర్ పాల్గొన్నారు. కాళ్లలో స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం వేయగా రూ.లక్షా 30 వేలకు దక్కించుకున్నారు.ధర్మకర్త మంతెన సాయికృష్ణంరాజు లడ్డు ప్రసాదం అందించారు.


కాళ్లలో లడ్డూ ప్రసాదం దక్కించుకున్న భక్తులు


చోరీ సొత్తును చూపుతున్న ఏలూరు ఎస్పీ కిషోర్

## ముగ్గురు దొంగల అరెస్టు

### రూ.పది లక్షల 78 వేల సొత్తు స్వాధీనం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 12 : తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో రాత్రివేళ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను పెదవేగి సర్కిల్ పోలీసు సిబ్బంది అరెస్టు చేశారని ఎస్పీ కిషోర్ చెప్పారు. పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళ్ళమూడిలో తాళం వేసి ఉన్న ఇంటిని ఈఏడాది మే 29న రాత్రి వేళ పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను అపహరించుకుపోయారు. ఈ ఘటనపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదవేగి సీఐ అబ్దున్‌నబీ, ఏలూరు సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, పెదపాడు ఎస్ఐ సుభశేఖర్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈనెల 11వ తేదీ అర్ధరాత్రి కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక మోటారు సైకిల్‌పై వస్తున్న ముగ్గురుని ఆపగా వారు పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసు కుని విచారించారు. విజయవాడ చిట్టినగర్‌లోని రామరాజ్‌నగర్‌కు చెందిన పేకేటి వెంకటరెడ్డి (36), నూజివీడు మండలం సీతారాంపురం గ్రామానికి చేకూరి వెంకటరెడ్డి (35) విజయవాడ కేపీ రోడ్డు కొత్తపేటకు చెందిన షేక్ అల్లా భక్షు (39)లను విచారించారు. ఈ ముగ్గురు తాళ్ళమూడిలో దొంగతనంతో పాటు పెదపాడులో మరో మూడు ఇళ్ళ దొంగతనాలు చేశారని నూజివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో మూడు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. వారి నుంచి 82 గ్రాముల బంగారపు వస్తువులు, నాలుగు కేజీల 756 గ్రాముల వెండి వస్తువులు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. చోరీ సొత్తు మొత్తం 10 లక్షల 78 వేలు రూపాయలని తెలిపారు. ఎస్ఐ సుభశేఖర్, పెదవేగి సర్కిల్ టీమ్, ఏలూరు సీసీఎస్ ఎస్ఐ చంద్రశేఖర్‌లను, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## చెయిన్ స్నాచర్ అరెస్ట్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 12 : రోడ్డుపై నడిచి వెళ్తున్న ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును తెంపుకుని మోటారు సైకిల్‌పై పారిపోయిన ఒక వ్యక్తిని ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారని ఎస్పీ కిషోర్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి రైతు భరోసా కేంద్రం సమీపంలో నివాసం ఉంటున్న చింతపల్లి సూర్యకుమార్ (33) ఈనెల 4వ

## క్రైం కార్నర్..

తేదీ ఉదయం రోడ్డుపైన నడిచి వెళ్తున్న ఒక మహిళ మెడలోని బంగారపు చైన్ మోటారు సైకిల్‌పై వచ్చి తెంపుకుని పారిపోయాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వన్ టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మదీనాబాషా, కానిస్టేబుళ్ళు మోహన్ కృష్ణ, నాగార్జున, లక్ష్మీనారాయణ, గణపవరం సీఐ సుభాష్, హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు నిఘా ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం ఏలూరు గడియార స్తంభం వద్ద మోటారు సైకిల్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న సూర్యకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతని నుంచి 33 గ్రాముల బంగారం (రెండున్నర లక్షల రూపా యలు) స్వాధీనం చేసుకున్నామని నేరానికి వినియోగించిన మోటారు సైకిల్ స్వాధీనం చేసు కున్నామన్నారు. ఎస్పీతో పాటు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, పెదవేగి సీఐ అబ్దుల్ నబీ, గణపవరం సీఐ సుభాష్ పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


అనిల్(ఫైల్)

టి.నరసాపురం, సెప్టెంబరు 12: ఆర్థిక ఇబ్బందులు భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు టి.నరసాపురం పరిధిలోని ఎర్రచెరువు కాలనీకి చెందిన పరసా ఏసు కుమారుడు అనిల్ (26) ఉదయం 6.30 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## దాడి కేసులో మూడేళ్ల జైలు శిక్ష

ఏలూరు క్రైం, సెప్టెంబరు 12 : ఒక వ్యక్తిని కర్రతో దాడి చేసి చేయి విరగ గొట్టిన ఒక వ్యక్తిపై నేరం రుజువు కావడంతో అతనికి మూడు సంవత్సరాల 15 రోజులు జైలు శిక్ష, ఆరు వేల 500 రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాసుదేవ్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఏలూరు సత్యనారాయణ పేటకు చెందిన బడిగంటల లీలారాజు (24) 2022 సెప్టెంబరు 22న ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు.దీనిపై ఆమె భర్త ప్రశ్నించగా లీలారాజు కర్రతో కొట్టి చేయి విరగగొట్టాడు. ఈ సంఘటనపై వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ కేసు నమోదు చేయగా అప్పటి ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష, జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ హేమలత వాదించగా ప్రాసిక్యూషన్‌కు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ,ఎస్ఐ మదీనాబాషా,కోర్టు కానిస్టేబుల్ సంగయ్య సహకరించారు.

## విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 12: నిమ్మలగూడెం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై కంకిపాటి నాగరాజు (48) చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. నాగరాజుకు నిమ్మలగూడెంలో కొంత పొలం ఉంది. పొలంలో ఉన్న విద్యుత్ స్తంభంపై నుంచి మోటారుకు వెళ్ళే విద్యుత్ తీగలకు కనెక్షన్ ఇవ్వడానికి గురువారం ఉదయం తన కుమారుడు జ్యోతిరాదిత్య, మరో వ్యక్తి బుగ్గా సత్యనారాయణతో పాటు వెళ్ళారు. వైర్లను స్థంభంపై కనెక్ట్ చేయడానికి విద్యుత్ లైన్‌మేన్‌కు ఫోన్ చేయగా హెల్పర్ రామారావును పంపారు. అనంతరం వైర్లను కనెక్ట్ చేయడానికి విద్యుత్ సరఫరాను (ఎల్‌సి) నిలిపివేయాలని లైన్‌మ్యాన్‌కు ఫోన్ చేయగా ఆయన ఎల్‌సి ఓకే అయ్యిందని చెప్పారు. స్థంభంపై వైర్లు బిగించడానికి నిచ్చెన వేసుకుని ఉన్న హెల్పర్ రామారావుకు నాగరాజు, అతని కుమారుడు జ్యోతి రాదిత్య సత్యనారాయణ విద్యుత్ వైర్లను అందిస్తుండగా ఒకేసారి విద్యుత్ సరఫరా అవడంతో నాగరాజు అక్కడిక్కడే మృతి చెందగా అతని కుమారుడికి రెండు చేతులకు, ఎడమ కాలికి గాయాలయ్యాయి. మరొక వ్యక్తి సత్యనారాయణ స్పృహ తప్పి పడిపోయారు. విద్యుత్ శాఖ సిబ్బంది అనసత్వం వల్లనే తన తండ్రి మృతి చెందాడని తమకు గాయాలయ్యాయని మృతుని కుమారుడు జ్యోతిరాదిత్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

యలమంచిలి, సెప్టెంబరు 12: ఇటీవల ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడిన కంచుస్తంభంపాలెం గ్రామానికి చెందిన కె.కె.ఎస్ వెంకటేశ్వరరావు(62) భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ గుర్రయ్య తెలిపారు. వెంకటేశ్వరరావు ఆగస్టు 31న బైక్‌పై పాలకొల్లు నుంచి ఇంటికి తిరిగి వెళుతుండగా దొడ్డిపట్ల ప్రధాన కూడలి సమీపంలో కళ్లు తిరగడంతో పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న అతని బంధువులు మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరంలోని ఒకప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరావు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ఉండి, సెప్టెంబరు 12 : భార్యను చంపిన కేసులో భర్త గొల్ల చిరంజీవిని అరెస్టు చేసినట్టు ఆకివీడు సీఐ జగదీశ్వరరావు తెలిపారు. ఈ నెల 5న ఉండి మండలం కలిగొట్లలో చిరంజీవి తన భార్య సత్యవతిని హత్య చేశాడు. ఈ కేసులో నిందితుడు చిరంజీవిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు. కోర్టు రిమాండ్ విధించిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ.. నలుగురికి గాయాలు

అత్తిలి, సెప్టెంబరు 12 : అత్తిలి గ్రామం రామన్నపేట ఐశ్వర్య దుర్గమ్మ ఆలయం వద్ద ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. గురువారం రాజోలుకు చెందిన దంపతులు తాడేపల్లిగూడెం శుభకార్యానికి వెళ్ళి తిరిగి వస్తుండగా అత్తిలి రామన్నపేటకు చెందిన ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొట్టడంతో బైక్‌లపై ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తణుకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



తాడేపల్లిగూడెంలో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

## విశాఖ ఉక్కును కాపాడుకుందాం

▸ రైతు కార్మిక సంఘాలు, సీఐటీయూ నాయకుల ఆందోళనలు

భీమవరం అర్బన్/తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 12 : కేంద్ర పాలకులు విశాఖ ఉక్కును తాకట్టు పెట్టే ప్రయత్నాలు విరమించకపోతే ఉద్యమం తప్పదని రైతు కార్మిక సంఘాల జిల్లా కమిటీలు హెచ్చరించాయి. గురువారం ప్రకాశం చౌక్‌లో రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కును కాపాడుకుందాం అంటూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు విషయంలో ఏమి చేస్తుందోనని ప్రజలు వేచి చూస్తున్నారన్నారు. రైతు కార్మిక సంఘం నేతలు జేఎన్వీ గోపాలన్, చెల్లబోయిన రంగారావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఆనంద్, వాసుదేవరావు, డి. కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెంలో పోలీస్ ఐలాండ్ వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. పట్టణ కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు సి.రంగారావు, నాయకులు చిర్లపుల్లారెడ్డి, తదితరులు మాట్లాడారు.

## ఎరువుల గోదాములపై విజిలెన్స్ దాడి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 12: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు, వ్యవసాయాధికారులు గురువారం తనిఖీలు చేశారు. కడకట్లకు చెందిన వాసాబత్తుల రామకృష్ణకు చెందిన గోదాములో రూ.1.82 లక్షల విలువ చేసే 6.40 మెట్రిక్ టన్నుల ఎరువులు లెక్కకు మించి ఉన్నట్టు గుర్తించారు. కనకదుర్గా ఫెర్టిలైజర్ షాపులో రూ.69 వేల విలువ చేసే 8.10 మెట్రిక్ టన్నుల ఎరువులు లెక్కలకు మించి ఉన్నట్టు గుర్తించి యజమాని ఆచంట రామకృష్ణపై కేసున మోదు చేసి ఆ స్టాకు సీజ్ చేసినట్టు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ తెలిపారు. దాడిలో విజిలెన్స్ ఏవో పి.సురేష్, విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి, ఏవో ఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

## పని సర్దుబాటులో సమస్యలు పరిష్కరించండి

భీమవరం రూరల్, సెప్టెంబరు 12 : ఉపాధ్యాయుల పని సర్దుబాటులో భాగంగా వచ్చిన సీనియార్టీ సమస్యలు రాష్ట్రస్థాయి అధికారులు సమక్షంలో పరిష్కరించాలని డీఈవో నాగమణికి గురువారం ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సాయివర్మ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పనిసర్దుబాటులో భాగంగా వచ్చిన సీనియార్టీ సమస్యలపై జిల్లావ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందిస్తామన్నారు. ఎస్టీయూ జిల్లా నాయకులు మన్నె వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి వెంకటేశ్వరరావు, సీహెచ్ మోహన్‌బాబు, వి.జనార్దనరావు, పీడీవీ ప్రసాద్, ముదునూరి నారాయణరాజు పాల్గొన్నారు.

## 'నిరంతర ప్రజా సేవకుడు మంత్రి నిమ్మల'

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 12:రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు నిరంతర ప్రజా సేవకుడు అని టీడీపీ పట్టణ నాయకులు అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి వెంకట నరసింహారావు కార్యాలయంలో పార్టీ పట్టణ నాయకులు గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో బుడమేరు ముంపు నుంచి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు అవిశ్రాంతంగా శ్రమించిన మంత్రి నిమ్మలకు అభినందనలు తెలిపారు. జలవనరుల శాఖకే వన్నెతెచ్చారని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు అన్నారు. సమావేశంలో బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు ధనాని ప్రకాష్, వల్లభు శ్రీనివాస్, పొట్నూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఏవీఎస్ఎన్ఎం హైస్కూల్‌కు స్టీలు సామగ్రి బహూకరణ

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 12 : స్థానిక బ్రాడీపేటలోని ఏవీఎస్ఎన్ఎం హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమయంలో ఉపయోగపడే విధంగా దాత తిల్లపూడికి చెందిన కామిశెట్టి అయ్యప్ప నాయుడు స్టీలు వాటర్ క్యాన్, బకెట్లను గురువారం అందజేశారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం ఆర్ భవానీ ప్రసాద్ సహకారంతో హెచ్ఎం ఎం.సురేష్, స్టాఫ్ కార్యదర్శి డి.రాజ్ కుమార్ సమక్షంలో విద్యార్థులకు అందించారు. ఈ ఏడాది ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన ఎస్.ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

## ఘనంగా తోట సీతారామలక్ష్మి జన్మదిన వేడుకలు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 12 : నిస్వార్థ ప్రజాసేవకురాలు తోట సీతారామలక్ష్మి అని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. భీమవరం నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి పుట్టినరోజు పురస్కరించుకుని గురువారం ఎన్డీఏ కూటమి నాయకులు ఆధ్వర్యంలో పట్టణంలోని బధిర పాఠశాలలోని చెవిటి, మూగ విద్యార్థులకు, పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పాత బస్టాండ్ అన్న క్యాంటీన్ వద్ద కేక్‌ను కట్ చేసి పేదలకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ కృష్ణ బలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు గంటా త్రిమూర్తులు, మెంటే పార్థసారధి, కోళ్ళ నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, ఇందుకూరి సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలు అభినందనీయం

పెంటపాడు, సెప్టెంబరు 12 : ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అలంపురం ట్రస్టు ఆస్పత్రిని గురువారం ఆయన సందర్శించారు. ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. తొలుత గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కె.వెంకట్, కొలనువాడ గోవిందరాజు, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ట్రస్టు ఆస్పత్రిని సందర్శించిన ఆరిమిల్లి

## కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం : పాతపాటి

గణపవరం, సెప్టెంబరు 12: సమష్టి ప్రణాళికతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు అన్నారు. గురువారం పిప్పర పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియామకపత్రాలను విజయవాడ ఆంధ్రరత్న భవనంలో ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేతుల మీదుగా అందుకునట్టు తెలిపారు.

## వీఆర్వో ఇంట్లో చోరీ

నరసాపురం, సెప్టెంబరు 12 : పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలోని సుబ్బయ్య వీధిలో నివాసం ఉంటున్న వీఆర్వో కటకంశెట్టి వేణుగోపాలం ఇంట్లో బుధవారం రాత్రి పది తులాల వెండి, ఒక ల్యాప్‌టాప్ చోరీ జరిగినట్టు సీఐ యాధగిరి తెలిపారు. తల్లిని ఆస్పత్రికి తీసుకెళ్లి తిరిగి ఇంటికి వచ్చే తాళాలు పగలుగొట్టి ఇంట్లోని వస్తువులు అపహరించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## సంక్షిప్త సమాచారం..

- **పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 12 :** స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలో ప్రతిభ చాటి బహుమతులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు.
- **పాలకోడేరు :** మోగల్లులో భీమవరం సబ్‌యూనిట్ ఆఫీసర్ భాస్కరరావు, వైద్య సిబ్బందితో కలిసి గురువారం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గొరగనమూడిలో వైద్యసిబ్బంది సహకారంతో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు.
- **నరసాపురం :** నరసాపురంలోని రాయపేటలో ఉన్న బీసీ సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆర్. వరలక్ష్మి గురువారం ఆకస్మిక తనిఖీ చేసి బాలికలతో మాట్లాడి హాస్టల్‌లో అందిస్తున్న ఆహార పదార్థాలు, పరిశుభ్రత వంటి వాటిపై ఆరాతీశారు.
- **పెనుగొండ :** పెనుగొండ లయన్స్ క్లబ్ క్లబ్ అధ్యక్షుడిగా జక్కం విజయ్, సెక్రటరీగా గుమ్మడి చంటి, ట్రెజరర్‌గా మండ ప్రసాద్, పలువురు సభ్యులు గురువారం పెనుగొండలోని మాస్టర్ మైండ్ స్కూలులో ప్రమాణ స్వీకారం చేశారు.



విజయవాడ వరద బాధితుల కోసం కలెక్టర్‌కు చెక్కులు అందిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు



ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు రూ.5.60 లక్షల చెక్కును అందజేస్తున్న లోటస్ స్కూల్ విద్యార్థులు



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న తాడేపల్లిగూడెం ఎంఈవోలు, ఉపాధ్యాయులు



భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబుకు చెక్కు అందజేస్తున్న మునిసిపల్ మెప్మా సిబ్బంది

# వరద బాధితులకు విరాళాల వెల్లువ

భీమవరంటౌన్, సెప్టెంబరు 12 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా రెవెన్యూ అసోసియేషన్, ఉద్యోగుల తరపున వీఆర్‌ఏ స్థాయి ఉద్యోగి నుంచి తహసీల్దార్ స్థాయి వరకు సీఎం సహాయనిధికి రూ.7లక్షల 54,030 చెక్కును గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందజేశారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు, తహసిల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి రూ2,60,500, ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) భీమవరం డివిజన్ తరపున రూ1,26,069 చెక్కులను కలెక్టర్‌కు డీఈవో జి.నాగమణి, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, అప్సా అసోసియేషన్ సభ్యులు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మండల విద్యాశాఖ అధికారులు వి.హనుమ, పీఎంకే జ్యోతి, హెచ్ఎం ఎం.సత్యనారాయణ, అప్సా అసోసియేషన్ సభ్యులు సుంకర మాణిక్యాలరావు, తిరుమల రవి, స్వర్ణలత, నందమూరి రాజేష్, సుభద్రాదేవి, హరి సింగ్ పాల్గొన్నారు.

- భీమవరంటౌన్ : వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెప్మా సీఆర్‌పీలు రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యేకు అందించారు. పొత్తూరి బాపిరాజు, నాగభూషణం, కొప్పర్తి నారాయణరావు, మెప్మా నానిబాబు, సీఆర్‌పీలు పాల్గొన్నారు. చినఅమిరానికి చెందిన గొట్టుముక్కల ప్రసాద్‌రాజు రెండు లక్షల రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యేకు అందించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు. మారుతి నగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సీఎం సహాయ నిధికి రూ.21,116 ఎమ్మెల్యేకు అందించారు. తాడేరుకు చెందిన తిరుమల వెంకటేష్, తిరుమల వెదేష్ రూ.50వేలు, అడబాల వెంకటరామకృష్ణ రూ.25 వేలు అందించారు. దాతలను ఎమ్మెల్యే అంజిబాబు అభినందించారు.బండిరమేష్‌కుమార్, కత్తుల నిలేంద్ర, శ్రీరాములు పాల్గొన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరపున సీఎం సహాయ నిధికి 50వేల116 రూపాయల చెక్కును ఛాంబర్ అధ్యక్షుడు బొండాడ రామోహనరావు అందజేశారు.

తాడేపల్లిగూడెం అర్బన్, : వరద బాధితులకు పట్టణంలోని లోటస్ స్కూల్ విద్యార్థులు రెండు రోజులుగా సేకరించిన రూ.5.60 లక్షలను ప్రిన్సిపాల్ దేవీప్రియ సమక్షంలో గురువారం జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు చెక్కు రూపంలో అందజేశారు.

- ప్రత్తిపాడు ఫుడ్‌ప్యాట్ కర్మాగార యాజమాన్యం తరపున జనరల్ మేనేజర్ జె.జనార్దన్ రూ.5 లక్షలు, పట్టింపాలెం ప్రజలు తరఫున సర్పంచ్ బనిగే పోతన రూ.50 వేలు, తాడేపల్లిగూడెం సాయిరాం ఫుడ్స్ రూ.25 వేలు, కొమ్ముగూడెం సర్పంచ్ తాడేపల్లి బేబి , శ్రీను దంపతులు రూ.20 వేలు, తాడేపల్లిగూడెం డైమండ్స్ క్లబ్ రూ.25 వేలు, తాడేపల్లిగూడెం క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ రూ.1,16,000 , ఉమామహేశ్వరం సర్పంచ్ మద్దుకూరి నాగేశ్వరరావు రూ.25 వేలు, పెదతాడేపల్లి అలపాటి రామచంద్రరావు రూ 50 వేలు, ఇంకులు నాగ వెంకట సత్యసాయిశేఖర్ రూ.10 వేలు, తాడేపల్లిగూడెం వీకన్వెన్షన్ కేటీఎస్ రవిప్రసాద్ రూ.10 వేలు, ధర్మా ఫంక్షన్ హాల్ సీహెచ్ రాజేంద్రప్రసాద్ రూ.10 వేలు, మాగంటి ఫంక్షన్ హాల్ కె.పరశురామయ్య రూ.10 వేలు, బుద్దాల కన్వెన్షన్ రూ.10 వేలు, ఆరుళ్ల గ్రామం నుంచి గూడవల్లి నాగేశ్వరరావు రూ.25,500, ముత్యాల వేదశ్రీ రూ.10 వేలు, పంతం శివరామకృష్ణ, జనసైనికులు రూ.75 వేలు, పోతుల సత్తిబాబు రూ.51 వేలు, సంఘట శ్రీనివాస్ గౌడ్ రూ.28 వేలు, చీర్ల బ్రహ్మారావు కుమారుడు చీర్ల రవికుమార్ రూ.50 వేలు, మారిశెట్టి పవన్‌బాలాజీ టీం రూ.20 వేలను ఎమ్మెల్యేకు అందజేశారు.
- తాడేపల్లిగూడెం అర్బన్: వరద బాధితులను ఆదుకోవలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పిలుపు మేరకు పలు గ్రామాల నుంచి టీడీపీ నాయకులు గురువారం విరాళాలు అందజేశారు. పడాల నుంచి రూ.51,116, ముదుగుంట నుంచి రూ.15 వేలు, పెదతాడేపల్లిగూడెం గ్రామానికి చెందిన ఆలపాటి శేఖర్ రూ.50 వేలు, క్లస్టర్ ఇంచార్జి వాడపల్లిసుబ్బరాజు రూ.25 వేలు, మెట్ట ఉప్పరగూడెం గ్రామం నుంచి రూ.36,620లు, అమృతపురం నుంచి రూ.24,810, ఇటుకుల గుంట నుంచి రూ.20 వే లు, దండగర్ర నుంచి రూ.27,600, లింగరాయుడు గూడెం నుంచి రూ.22,300లు, వలవల సూరిబాబు సతీమణి వలవల నాగమణి(మారుతీ ట్రాన్స్‌పోర్ట్) రూ.25 వేలు, సబ్బీను కృష్ణమోహన్, వేముల మల్లికార్జునరావు రూ.15 వేలు అందజేశారు.
- భీమవరం అర్బన్ : విజయవాడలో వరద బాధితుల కోసం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో సహాయ శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతిరోజు మంచి నీళ్లు, భోజనాలు పాలు, ఇంటింటికి అందిస్తున్నారని సీఐటీయు జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ తెలిపారు. భీమవరం బజార్ లాగుడు పండ్లు ముఠా కార్మిక సంఘం రూ.25 వేల నగదును గురువారం అందించారు. కార్యక్రమంలో వాసు దేవరావు, ఎం.ఆంజనేయులు, రాము, శ్రీను, కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.
- భీమవరంటౌన్ : మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మనుమడు గ్రంధి షణ్ముఖ్ విజయవాడ ముంపు బాధితులకు రూ.20వేల 850 చెక్కును కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిన్నారి గ్రంధి షణ్ముఖ్‌ను అభినందించి ఆశీర్వదించారు.
- తణుకు/ఇరగవరం :విపత్తుల సమయంలో ఆదుకునే గుణం మరువలేనిదని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం పలువురు పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, ప్రజలు విచ్చేసి సుమారు రూ.90 లక్షల వరకు చెక్కులను అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కుమ్మరి శాలివాహన విద్య విజ్ఞాన సంక్షేమ సంఘం అధ్యక్షుడు, టీడీపీ నర్సాపురం పార్లమెంటరీ కుమ్మరి శాలివాహన సాధికార సమాఖ్య కన్వీనర్ చుంచుల వెంకటేశ్వరరావు, సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 వేల చెక్కును తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

### వరద బాధితులకు ఆరిమిల్లి వేతనం

వరద బాధితులకు తన వంతు సహాయంగా తన వేతనం రూ.1.75 లక్షలు అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తానన్నారు.

- గణపవరం : వరద బాధితుల సహాయార్థం గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు గణపవరం మండల టీడీపీ నేతలు రూ.5లక్షల 20వేలు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, ఏలూరు జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కాపారం చిన్న, మండల అధికార ప్రతినిధి కూనసాని నాగేశ్వరరావు, మొయ్యేరు టీడీపీ అధ్యక్షులు కానుమిల్లి చంటి విరాళాలను ఎమ్మెల్యేకు అందజేశారు.



ఎమ్మెల్యే ధర్మరాజుకు చెక్కు అందజేస్తున్న గణపవరం టీడీపీ నేతలు



ఎమ్మెల్యేకు చెక్కు అందిస్తున్న చిన అమిరానికి చెందిన గొట్టుముక్కల ప్రసాదరాజు



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న అప్సా అసోసియేషన్ సభ్యులు



వలవల బాబ్జికి విరాళాలు అందజేస్తున్న మెట్ట ఉప్పరగూడెం టీడీపీ నాయకులు



తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు చెక్కు అందిస్తున్న దాతలు

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తాడేపల్లిగూడెం రూరల్/యలమంచిలి/ పాలకోడేరు/ఉండి/ఆచంట/ నరసాపురం టౌన్/పెనుగొండ/పెనుమంట్ర, సెప్టెంబరు 12: పిల్లలకు, బాలింతలకు, కిశోర బాలికలకు పోషకాహారం అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించగల మని సీడీపీవో టీఎల్ సరస్వతి సూచించారు. గురువారం తాడేపల్లిగూడెం పట్టణంలోని పలు వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషకాహార మాసోత్స వాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గాభవాణి, విశాలాక్షి, పాల్గొన్నారు. యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెం గ్రామం అడిషనల్ సీడీపీవో నాగరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో, పాలకోడేరు మండలం కుముదవల్లిలో అంగన్వాడీ సూపర్‌వైజర్ బాలకుమారి ఆధ్వర్యంలో, ఉండి మండలం పాందువ్వలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటరమణ ఆధ్వర్యంలో, ఆచంట మండలం ఆచంట వేమవరంలో ఐసీడీఎస్ కొడమంచిలి సెక్టార్ సూపర్‌వైజర్ సూర్యకుమారి ఆధ్వర్యంలో, నరసాపురం పట్టణంలోని అంకానివారితోట అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో ఊర్మిళ నేతృత్వంలో, పెనుగొండ మండలం పెనుగొండలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి ఆధ్వర్యంలో, పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరంలోని అంగన్వాడీ కేంద్రంలో సీడీపీవో కృష్ణకుమారి ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు.



తాడేపల్లిగూడెం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో సరస్వతి

## రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది : గన్ని

గణపవరం, సెప్టెంబరు 12: భారీ వర్షాలు, వరదలతో ముంపుబారిన పడి నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని ప్రభుత్వం ఆదుకుంటుందని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. గురువారం గణపవరంలోని చినరామ చంద్రపురం టీడీపీ కార్యాలయంలో గణపవరం, నిడమర్రు మండలాల టీడీపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిప్పర, మొయ్యేరు, ఎస్.కొండేపాడు తదితర గ్రామాల్లో, నిడమర్రు మండలంలో దెబ్బతిన్న పంట వివరాలను ఆయా నాయకులతో సమీక్షించారు. గణపవరం, నిడమర్రు మండల టీడీపీ అధ్యక్షులు ఇందుకూరి రామ కృష్ణంరాజు, ముత్యాల స్వామి, అద్దేపల్లి వాసురాజు, యాళ్ళ సుబ్బారావు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న, కూనసాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## అత్యాచారం చేశాడని మహిళ ఫిర్యాదు.. కేసు నమోదు

భీమవరం క్రైం, సెప్టెంబరు 12 : తనను ఓ వ్యక్తి అత్యాచారం చేశాడంటూ ఓ మహిళ టూటౌన్ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టూటౌన్ ఎస్ఐ పాజల్ రెహమాన్ తెలిపారు. భీమవరం పట్టణానికి చెందిన ఓ మహిళ ప్రతీరోజు వాకింగ్‌కు డీఎన్నార్ కళాశాల క్రీడామైదానంకు వెళ్ళేది. అక్కడ చెన్నంశెట్టి మధుకుమార్‌తో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ఆ మహిళ భర్తకు తెలిసి భార్యభర్తలు ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నారు. మధుకుమార్ ఆ మహిళ ఇంటికి వెళ్ళి వేధించడం ప్రారంభించాడు. ఈక్రమంలో ఈనెల 11వ తేదీ రాత్రి ఆ మహిళకు ఫోన్ చేసి క్రీడామైదానానికి రావాలని కోరడంతో ఆ మహిళ రాత్రి 8 గంటల సమయంలో వెళ్ళింది. ఇద్దరి మధ్య వాగ్వివాదం పెరగడంతో ఆ మహిళపై చేయి చేసుకుని అనంతరం ఆమెకు ఇష్టం లేకుండా అత్యాచారం చేశాడని.. ఆమె కేకలు వేయడంతో అతడు పరారయ్యాడు. ఈ మేరకు ఆమె ఫిర్యాదు మేరకు అతడిపై అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ చట్టాల క్రింద కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



భీమవరంలో ఏచూరి చిత్రపటం వద్ద సీఐటీయూ నాయకుల నివాళి

## సీపీఎం నేత సీతారాం ఏచూరికి ఘన నివాళి

భీమవరంఅర్బన్/ఆకివీడు/మొగల్తూరు/పెనుగొండ/ఆచంట/నరసాపురం, సెప్టెంబరు 12: సీపీఎం ఆలిండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి చల్లబోయిన రంగారావు, సీఐటీయూ నాయకులు జేఎన్‌వీ గోపాలన్, వాసుదేవరావు నివాళులర్పించారు. ఆకివీడు సీపీఎం కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కె.తవిటినాయుడు ఆధ్వర్యంలో, మొగల్తూరు మండలం మొగల్తూరులో సీపీఎం శాఖ మాజీ కార్యదర్శి పొదిల కృష్ణమూర్తి, ఆదూరి సాంబమూర్తి, కొత్త విజయ్ కుమార్ సంతాపం తెలిపారు. పెనుగొండ మండలం పెనుగొండ పార్టీ కార్యాలయం వద్ద సీపీఎం కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, ఆచంట మండలం ఆచంటలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్ ఆధ్వర్యంలో, నరసాపురం పట్టణంలోని స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం నాయకులు బి.బలరామ్, కవురు పెద్దిరాజు, తెలగంశెట్టి సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

## ఘనంగా గణనాథుడి నిమజ్జనాలు

ఆచంట/ఉండి/ఆకివీడు/మొగల్తూరు, సెప్టెంబరు 12 : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఆచంట, ఉండి మండలాల్లోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను గురువారం నిమజ్జనం చేశారు. ఉండిలోని శ్రీరామక్షేత్రం ఆలయ ప్రాంగణంలో వరసిద్ధ వినాయక స్వామి ఊరేగింపు నిర్వహించి, అనంతరం నిమజ్జనం చేశారు. మహిళలు, భక్తులు పాల్గొన్నారు. ఆకివీడులోని అగ్నికుల క్షత్రియుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు. మొగల్తూరు హైస్కూల్, కోట వద్ద నిర్వహించిన అన్నసమారాధనల్లో పెద్ద ఎత్తున భక్తులు ప్రసాదాలు స్వీకరించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు పాల్గొన్నారు.

### వైభవంగా లక్ష్మీగణపతి హోమం

పెంటపాడు, సెప్టెంబరు 12 : వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా అలంపురం టీబీఆర్ స్కూల్ ప్రాంగణం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుని మందిరంలో గురువారం లక్ష్మీ గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. 16న స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తామని సంస్థ అధినేత టి.భోగేశ్వరరావు తెలిపారు. రాచర్లలో ప్రతిష్ఠించిన వినాయకుడిని మిడ్ లెవిల్ కాలువలో నిమజ్జనం చేశారు.



టీబీఆర్ స్కూల్ వద్ద లక్ష్మీగణపతి హోమం పూజలు

## వార్డుల్లో సమస్యలు నేరుగా తెలపండి : కమిషనర్

భీమవరంటౌన్, సెప్టెంబరు 12 : వార్డులోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ఆదేశించారు. గురువారం పట్టణంలో 24వ వార్డులో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రభుత్వం అందించే పథకాలను, సేవలను సకాలంలో ప్రజలకు అందించాలని సూచించారు. కుళాయి, ఆస్తి పన్నులు ఎవరైనా బకాయిలు ఉంటే నోటీసులు జారీ చేసి బకాయి వసూలు చేయాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీత ఎస్ఆర్‌కేఆర్ పూర్వ విద్యార్థికి సత్కారం

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 : భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థి, ఎస్ఎల్‌వీ గ్రూప్ సీఈవో అండ్ డైరెక్టర్ వేగేశ్న అప్పల నరసింహరాజుకి టైమ్స్ గ్రూప్ యంగ్ ఎంట్రప్రెన్యూర్ ఇన్ రియల్ ఎస్టేట్ అవార్డు ప్రదానం చేసిన సందర్భంగా కళాశాలలో గురువారం సత్కరించారు. కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో సన్మానించారు. కళాశాల డైరెక్టర్ పూర్వపు సివిల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ జగపతి రాజు మాట్లాడుతూ దేశంలో సివిల్ ఇంజనీరింగ్‌కు భవిష్యత్ ఉందన్నారు.

## బాలలు చదువుకుని సమాజానికి దోహదపడాలి

ఆకివీడు, సెప్టెంబరు 12 : ఆర్థిక చేయూత ద్వారా లబ్ధిపొందిన బాలలు స్కూళ్లకు వెళ్లి చదువుకుని సమాజానికి దోహదపడాలని జిల్లా బాలల సంరక్షణాధికారి ఆర్.రాజేష్ సూచించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని స్పాన్సర్‌షిప్ ప్రోగ్రామ్ ద్వారా లబ్ధిపొందిన బాలలు వారి తల్లిదండ్రులు, గార్డియన్స్‌లకు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

## ఎమ్మెల్యే పితానికి ఘన స్వాగతం

ఆచంట, సెప్టెంబరు12 : ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఇటీవల విదేశాలు వెళ్లి తిరిగి గురువారం స్వదేశానికి వచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చిన ఆయనకు ఎయిర్‌పోర్టు వద్ద ఆచంట మండలం నుంచి అనేక మంది కూటమి శ్రేణులు విజయవాడ వెళ్ళి ఘన స్వాగతం పలికారు.



ఎమ్మెల్యే పితానికి స్వాగతం పలుకుతున్న కూటమి సభ్యులు

## రిజిస్టర్ కాని ల్యాబ్‌లు, ఆస్పత్రుల్ని గుర్తించాలి

నరసాపురం, సెప్టెంబరు 12:సబ్ డివిజన్‌లో రిజిస్టర్ కాకుండా నిర్వహిస్తున్న ల్యాబ్‌లు, ఆస్పత్రుల్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆర్డీవో అంబరీష్ ఆదేశించారు. గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వైద్యశాఖ అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ శస్త్రచికిత్సల సంఖ్యను తగ్గించాలన్నారు. కమిటీ సభ్యులు డీఎస్పీ మురళీకృష్ణ, డాక్టర్ శిరీష, డాక్టర్ గణేష్, నళిని, దానయ్యనాయుడు, పులపర్తి ప్రతాప్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 12 : పాలకొల్లు లాకోపేటకు చెందిన అంబేడ్కర్ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక పీఎల్‌కే ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి అంబేడ్కర్ సేవాసమితి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మెర్సీబాయి, ఎంఈవో వీరాస్వామి, హెచ్ఎం శ్రీప్రియ, నేతల రాఘవరావు, పిల్లి రాజు, ముత్యాలరావు, బుచ్చిరాజు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల ప్రాంతాలు

ఆకివీడు/కాళ్ల/తణుకు/పెంటపాడు, సెప్టెంబరు 12 : చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆకివీడు టౌన్, సమతా నగర్, ఇండస్ట్రియల్ ఫీడర్, గుమ్ములూరు రోడ్, కుప్పనపూడి ఫీడర్స్‌లలో కరెంట్ నిలుపుదల చేస్తామని డీఈ అహ్మద్ తెలిపారు. కాళ్ల మండలంలోని కాళ్ళ, దొడ్డనపూడి, కాళ్ళకూరు, కోలనపల్లి, జువ్వలపాలెం, ఏలూరుపాడు, ప్రాతాళ్ళమెరక గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు, తణుకు మండలంలోని దువ్వ, పైడిపర్రు, హౌసింగ్ బోర్డుకాలనీ, మండపాక, వేల్పూరులోని సంతమార్కెట్, ఎన్టీఆర్ కాలనీ, ఇరగవరం మండలంలోని తూర్పు విప్పర్రు, సూరంపూడి, కాకుల ఇల్లింద్రపర్రు, కె.కుముదలవల్లి గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడు గ్రామంతో పాటూ ఇండస్ట్రీలలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు.